క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు



గాడుబావి ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



అభయాంజనేయస్వామి

బేతంచెర్ల: బైటిపేట గాడు బావి ఆంజనేయస్వామి, గౌరిపేట అభయాంజనేయ స్వామి, పలక చింతమాను, కనుమ ఆంజనేయస్వామి ఆలయాల్లో భాద్రపద మాస అమావాస్య పూజలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం, సింధూర అర్చన, ఆకుపూజ, మహామంగళహారతులు నిర్వహించారు. అలాగే పుట్ట పెద్దమ్మ ఆలయం, సిమెంట్‌నగర్‌లోని సుంకులా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో కూడా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

ధర్నాను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామన్న

డోన్ టౌన్: క్యాబినెట్ ఆమోదించిన 2260 ప్రత్యేక ఉపాధ్యాయుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడారు. జీవో నంబర్ 13ను అమలు చేయాలని, ప్రత్యేక డీఎస్సీ ద్వారా పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఈ నెల 24న కర్నూలులోని జగదీష్ మాల్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ, ధర్నా అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు.

వివాదాలకు దూరంగా ఉండాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ

కొలిమిగుండ్ల: వివాదాలకు దూరంగా ఉండి ప్రశాంత జీవనం గడపాలని సీఐ రమేష్‌బాబు సూచించారు. ఆదివారం యర్రగుడిలో ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బందితో కలిసి కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. పలువురు అనుమానితుల ఇళ్లలో సోదాలు చేశారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. చిన్న సమస్యలకు గొడవ పడకుండా ఉండాలని హితవుపలికారు. గ్రామంలో సమస్యలు ఉంటే వివాదాలకు పోకుండా తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. అనవసరమైన విషయాలకు అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

వృత్తి విద్యతో ఉపాధి అవకాశాలు



విద్యార్థులకు మెటీరియల్ అందజేస్తున్న యూటీఎఫ్ నేతలు

డోన్ టౌన్: వృత్తి విద్యా కోర్సుల ద్వారా మెరుగైన ఉపాధి అవకాశాలు ఉంటాయని యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు వెంకటసుబ్బారెడ్డి, సీనియర్ ఉపాధ్యాయుడు ఎస్.ఎస్. బాబు అన్నారు. ఆదివారం పాతపేట జెడ్పీ హైస్కూల్లో వృత్తి విద్యా కోర్సు విద్యార్థులకు మెటీరియల్ అందజేశారు. దసరా సెలవుల్లో పట్టణంలోని వివేకానంద ఇన్‌స్టిట్యూట్, స్ఫూర్తి అకాడమీ, ఎస్వీ నైస్ కంప్యూటర్స్, శ్రీసాయి గ్లోబల్ కంప్యూటర్స్ అండ్ ఎడ్యుకేషనల్ అకాడమీ, గౌస్ ఎలక్ట్రానిక్స్ తదితర రంగాల్లో ఇంటర్న్‌షిప్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని నైపుణ్యాన్ని పెంపొందించుకుని జీవితంలో రాణించాలని విద్యార్థులకు సూచించారు.

ముక్తేశ్వర ఆలయంలో సేవా పక్వాడ



పరిసరాలను శుభ్రం చేస్తున్న బీజేపీ నాయకులు

డోన్ టౌన్: స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా సేవా పక్వాడ కార్యక్రమాన్ని ఆదివారం బీజేపీ నాయకులు పాత బస్టాండ్ సమీపంలోని ముక్తేశ్వరస్వామి ఆలయంలో చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కౌన్సిలర్ ఉషాలక్ష్మీ, పార్టీ పట్టణ అధ్యక్షుడు బద్రీ సుధాకర్, ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్, వీరేష్‌బాబు తదితరులు ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు.

శరన్నవరాత్ర ఉత్సవాలకు ముస్తాబు

- విద్యుత్ దీపాలంకరణలో ఆలయాలు
- నేటి నుంచి అక్టోబర్ 2 వరకు వేడుకలు
- వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమివ్వనున్న అమ్మవారు



చౌడేశ్వరిదేవి

బనగానపల్లె రూరల్: దేవిశరన్నవరాత్ర ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో మండలంలోని పలు అమ్మవారి ఆలయాలు సుందరంగా ముస్తాబయ్యాయి. నందవరం గ్రామంలోని చౌడేశ్వరిదేవి అమ్మవారి ఆలయాన్ని అధికారులు సర్వాంగ సుందరంగా అలంకరించి, విద్యుత్ దీపాలతో మెరిసేలా తీర్చిదిద్దారు. ఉత్సవాలు నేటి నుంచి అక్టోబర్ 2 వరకు జరగనున్నాయి. రోజుకో అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. సోమవారం శైలపుత్రి రూపంలో, 23న బ్రహ్మచారిణి, 24న చంద్రఘంట, 25న కూష్మాండ, 26న స్కంధ మాత, 27న కాత్యాయనీ, 28న కాళరాత్రి, 29న మహాగౌరి, 30న మహాదుర్గ, అక్టోబరు 1న సిద్ధిధాత్రి, 2న చౌడేశ్వరిదేవి అలంకారంలో దర్శనమిస్తారు. అదే విధంగా బనగానపల్లె పట్టణంలోని కొండపేటలో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలోనూ ఉత్సవాల కోసం ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఉత్సవాల్లో ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ముస్తాబు చేసి, భక్తులకు స్వాగతం కోసం ప్రత్యేక సెట్టింగ్ ఏర్పాటు చేశారు. తొలి రోజు శైలపుత్రి అలంకరణ, 23న మంగళగౌరి, 24న శారదా దేవి, 25న అన్నపూర్ణ, 26న లలిత త్రిపురసుందరి, 27న గజలక్ష్మీ, 28న మహాలక్ష్మీ, 29న సరస్వతి, 30న మహిషాసురమర్ధిని, అక్టోబరు 1న రాజరాజేశ్వరి, 2న విజయలక్ష్మిగా భక్తులను కటాక్షిస్తారు. అక్టోబరు 3న వసంతోత్సవం, పాన్పుసేవ, తొట్ల పూజ, 4న చల్లముద్ద కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



విద్యుత్ దీపాలంకరణలో నందవరం చౌడేశ్వరిదేవి ఆలయం



ప్రత్యేక అలంకరణలో వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయం

ఆలయాలు ముస్తాబు

కోవెలకుంట్ల: పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి, మారెమ్మ ఆలయల్లో సోమవారం నుంచి దసరా మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 11 రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో అమ్మవారు ప్రతి రోజు ఒక్కో అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఉత్సవాల్లో భాగంగా ఆయా ఆలయాల్లో అమ్మవారు మొదటి రోజున వాసవీమాత రాజరాజేశ్వరీదేవి, మారెమ్మ అమ్మవారు బాలత్రిపుర సుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని కమిటీ సభ్యులు తెలిపారు.

ఏర్పాట్లు పూర్తి



సంజీవనగర్ కాలనీలో సిద్ధం చేసిన మండపం

బేతంచెర్ల: పట్టణంలోని అమ్మవారిశాలలో వెలసిన వాసవీ కన్యాకపరమేశ్వరి, దుర్గాపేట మహిషాసుర మర్ధిని, కొలుములపల్లె రోడ్డులోని చౌడేశ్వరీ మాత ఆలయాల్లో సోమవారం నుంచి ప్రారంభమయ్యే దసరా నవరాత్రి వేడుకల కోసం ఏర్పాట్లు పూర్తి చేశారు. సంజీవనగర్, హనుమాన్ నగర్, శ్రీనగర్ కాలనీ, కొత్తపేట, గౌరిపేట, వడ్డెపేట, అగ్రికల్చర్ లైన్, జంగాలపేట కాలనీ వాసులు దుర్గామాత విగ్రహాలను ప్రతిష్టించి ఉత్సవ మండపాలను సిద్ధం చేశారు. ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజూ ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఉత్సవాలకు వేళాయె

ప్యాపిలి: స్థానిక శ్రీమత్ కన్యకా పరమేశ్వరి ఆలయంలో సోమవారం నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. ఉదయం 7:15 గంటలకు పతాకావిష్కరణతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు. అనంతరం గణపతి పూజ, పుణ్యాహవచనం, చండీ ఆవాహన, నవగ్రహపూజ, మహాన్యాస రుద్రాభిషేకం, కుంకుమార్చన, చండీహోమం తదితర పూజలు నిర్వహిస్తామన్నారు. సాయంత్రం వాసవీ మాత స్వర్ణకవచాలంకృత అలంకరణలో దర్శనమిస్తారని తెలిపారు.

ఉత్తమ పంచాయతీగా తీర్చిదిద్దాలి



ఎలక్ట్రిక్ ఆటోలకు పూజ చేస్తున్న మంత్రి బీసీ

బనగానపల్లె రూరల్: బనగానపల్లె పట్టణాన్ని రాష్ట్రంలోనే ఉత్తమ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేయాలని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పంచాయతీ తరపున రూ.8.75 లక్షల విలువైన రెండు ఎలక్ట్రిక్ ఆటోలు, రూ.3.92 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన రెండు ఫాగింగ్ మిషన్లను ప్రారంభించారు. గ్రామ పంచాయతీకి ఇప్పటికే 14 టన్నుల స్మార్ట్ కంపాక్టర్ మిషన్, 28 డస్ట్‌బిన్‌లు అందుబాటులో ఉన్నాయని, మరికొన్ని స్మార్ట్ డస్ట్‌బిన్‌లు, ఈ- వేస్ట్ ఆటోలు కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. పారిశుద్ధ్యం పరిరక్షణలో నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈసారియల్లమ్మ, ఉపసర్పంచ్ బురానుద్దీన్, ఈఓ సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసి జిల్లా ఎస్పీ

నంద్యాల ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన సునీల్ షెరాన్ ఆదివారం మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. బనగానపల్లెలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయనకు పుష్పగుచ్చం అందజేశారు. జిల్లాలో శాంతిభద్రతల విషయంలో రాజీ లేకుండా ప్రజలకు రక్షణ కల్పించాలని మంత్రి సూచించారు.

ఆలయ అభివృద్ధికి వినతి

అవుకు(కొలిమిగుండ్ల): ఎర్రమల కొండల్లో వెలసిన శ్రీలక్ష్మీ కంబగిరిస్వామి ఆలయ ఈఓ రామకృష్ణ ఆదివారం సిబ్బందితో కలిసి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని బనగానపల్లెలోని ఆయన నివాసంలో కలిశారు. ఆలయానికి ప్రతి శుక్ర, శని వారాల్లో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఎక్కువగా వస్తుంటారని తెలిపారు. భక్తుల సౌకర్యం కోసం టీటీడీ ద్వారా 20 వసతి గృహాలను నిర్మించడంతో పాటు పలు అభివృద్ధి పనులపై చర్చించినట్లు ఈఓ తెలిపారు.

నేడు ఆశవర్కర్ల నిరసన



సమావేశంలో మాట్లాడుతున్న సుంకయ్య

డోన్ టౌన్: ఆశ వర్కర్లను మెడికల్ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం రూ.26వేలు చెల్లిస్తూ శాశ్వత ఉద్యోగులుగా చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్నేళ్లుగా ఆశ వర్కర్లను బానిసలుగా మలిచి వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారని విమర్శించారు. 8 గంటల పని వేళలు సహా పలు డిమాండ్ల పరిష్కారం కోసం సోమవారం తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రతి కార్యకర్త హాజరై ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక ఇవ్వాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐటీయూసీ సభ్యులు ఎస్తేరమ్మ, అన్వర్, ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి విద్యుత్ వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ రామమోహన్ తెలిపారు. అమడాల, గుంజలపాడు, జోళదరాశి, గుళ్లదుర్తి, పొట్టిపాడు, హరివరం, అల్లూరు, కొత్తపల్లె, కలుగొట్ల, కొప్పెర్ల, రేవనూరు ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ ఉంటుందని పేర్కొన్నారు.

సంజామలలో..

సంజామల: మండల పరిధిలోని సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఉన్న గ్రామాలకు ఈ వారం పగటి పూట 9 గంటల విద్యుత్ సరఫరా చేయనున్నట్లు ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. ముక్కమల్ల, వసంతాపురం, ఆల్వకొండ, రెడ్డిపల్లె, కమలపురి, కానాల, గిద్దలూరు, అక్కంపల్లె, ఆర్.లింగందిన్నెకు గ్రామాలకు ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని వివరించారు.

ఉద్యోగులకు డీఏపై నిరాశ

కోవెలకుంట్ల: దసరా పండుగకు ముందే డీఏ ఇస్తారని ఆశించిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు కూటమి ప్రభుత్వం నిరాశ కలిగించిందని జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం. షరీఫ్, ప్రతినిధి ముత్తోజ్ వీరబ్రహ్మం విమర్శించారు. ఎన్నికల సమయంలో డీఏ, పీఆర్సీ సకాలంలో ఇస్తామని చెప్పి 15 నెలలు గడిచినా ఇప్పటి వరకు అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏల్లో కనీసం రెండైనా దసరా లోపు ఇస్తారని భావించగా, కేబినెట్‌లో ఆ అంశంపై చర్చే జరగలేదన్నారు. వెంటనే డీఏల ప్రకటనతో పాటు పీఆర్సీ కమిషన్‌ను నియమించాలని డిమాండ్ చేశారు.

24న మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్

బేతంచెర్ల: దసరా పండుగను పురస్కరించుకుని బేతంచెర్ల హంటర్స్ టీమ్ ఆధ్వర్యంలో మండల స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ఈ నెల 24 నుంచి ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు. పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జరిగే ఈ పోటీల్లో విజేతలకు నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి సహకారంతో రూ.20 వేల నగదు బహుమతి, శంకర్ నాయక్, లక్ష్మణ్ సహకారంతో ద్వితీయ బహుమతిగా రూ.10 వేల నగదు అందజేయనున్నారు. ఆసక్తి గల జట్లు రూ.700 ఎంట్రీ ఫీజు చెల్లించి నమోదు చేసుకోవాలని, వివరాలకు 6302929484, 9581404374 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఇందిరానగర్‌లో యువకుల ఘర్షణ

డోన్ టౌన్: పట్టణంలోని ఇందిరానగర్‌లో ఆదివారం గంజాయి మత్తులో ఇరువర్గాల యువకుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఒక యువకుడు కారులో వెళుతుండగా పాత కక్షలను మనస్సులో ఉంచుకుని ఇందిరానగర్‌లో కారును ఆపి ఘర్షణకు దిగారు. ఈ ఘర్షణలో ఒక యువకుడికి గాయాలు కాగా సమీపంలోని ప్రజా వైద్యశాలకు తీసుకెళ్లారు. అంతటితో ఆగకుండా ఆస్పత్రికి వెళ్లి అడ్డుకోవడంతో పాటు సామగ్రి ధ్వంసం చేశారు. రోగులు, స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. పోలీసులు అదుపు చేసేందుకు ప్రయత్నించినా యువకులు మాటవినలేదు. వాతావరణం రణ రంగంలా తయారైంది. చివరకు పట్టణ పోలీసులు యువకులను స్టేషన్‌కు తరలించారు.

రణభేరిని విజయవంతం చేద్దాం



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు

డోన్ టౌన్: ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 25న గుంటూరులో జరిగే రణభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూటీఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించి వాల్ పోస్టర్లు విడుదల చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు వెంకటసుబ్బారెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షుడు సుబ్బరాయుడు, ఇతర నాయకులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులపై యాప్‌ల భారాన్ని తగ్గించాలని, బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల బైక్ జాతా చేసినా ప్రభుత్వం స్పందించకపోవడంతో రణభేరి చేపడుతున్నామని తెలిపారు.

గురజాడకు నివాళి

సంఘ సంస్కర్త, మహాకవి గురజాడ అప్పారావు జయంతి పురస్కరించుకుని యూటీఎఫ్ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన నివాస గృహాన్ని స్మారకంగా మార్చి, సాంస్కృతిక విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని తీర్మానించారు. సామాజిక కార్యకర్త మమ్మద్ రఫీ ఆధ్వర్యంలో తారకరామనగర్‌లో కూడా గురజాడ జయంతి జరుపుకుని నివాళులర్పించారు. యూటీఎఫ్ నాయకులు బాబు, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు రామమూర్తి, ఉపాధ్యక్షుడు అబ్దుల్ లతీఫ్, సర్వజ్ఞమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ముద్దవరం సమీపంలో రహదారిపైకి వచ్చిన కంపచెట్లు

రోడ్డును కప్పేసిన కంపచెట్లు

బేతంచెర్ల: మండల కేంద్రం నుంచి వెల్దుర్తి వెళ్లే డబుల్ రహదారిపై కంప చెట్లు పెరిగి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొలుములపల్లె, ముద్దవరం, వెంకటగిరి, పేండేకల్లు గ్రామాల మధ్య ఈ సమస్య ఎక్కువగా ఉందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారిపైకి చెట్లు వంగి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా ఆర్ అండ్‌బీ అధికారులు ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇరువైపులా చెట్లు తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

నవయుగ వైతాళికుడు గురజాడ



గురజాడ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

డోన్ టౌన్: సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా, వ్యవహారిక భాషా ఉద్యమానికి తన సాహిత్యాన్ని ఆయుధంగా మలచిన నవయుగ వైతాళికుడు, గొప్ప సంఘ సంస్కర్త గురజాడ వెంకట అప్పారావు అని సాహితీవేత్తలు డాక్టర్ తొగట సురేష్‌బాబు, తెలుగు ఉపాధ్యాయుడు దేవేంద్రప్ప అన్నారు. గురజాడ జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక రాష్ట్రోపాధ్యాయ సంఘం కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు భాస్కర్, ఉపాధ్యాయులు రాంప్రసాద్, రాంమోహన్, రామదాసు, కిరణ్, సుంకన్న, శ్రీనివాసకుమార్ తదితరులు పాల్గొన్నారు.



వాసవీ, వనితా క్లబ్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల అందజేత (ఫైల్)

సేవలోనే సార్థకత

- వాసవీ క్లబ్ ఆదర్శం
- సమాజ అభివృద్ధే ధ్యేయంగా సేవా కార్యక్రమాలు

బేతంచెర్ల: మానవ సేవ ద్వారానే జీవితం సార్థకమవుతుందని పెద్దలు చెప్పిన ఆచరణను వాసవీ క్లబ్ సభ్యులు తమ సేవా కార్యక్రమాలతో నిరూపిస్తున్నారు. ''మానవసేవయే మాధవ సేవ'' అన్న వాక్యాన్ని నిర్వచనంగా తీసుకుని పలు సేవా కార్యక్రమాలు చేపట్టి సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. 2016లో బేతంచెర్ల పట్టణానికి చెందిన 25 మంది ఆర్యవైశ్యులు వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్‌లో చేరి సమాజసేవకు పూనుకోగా, ప్రస్తుతం కందగడ్డల మోహన్‌రావు, బచ్చు సుబ్రమణ్యం, శేషమోహన్, సురేష్, లక్ష్మీనారాయణ, మట్టా రాజేష్, కల్కి సతీష్ తదితరుల నాయకత్వంలో సభ్యుల సంఖ్య 120కి చేరుకుంది. కరోనా విపత్కర కాలంలో మాస్కులు, శానిటైజర్లు, నిత్యావసర సరుకులు, వృద్ధులకు అన్నదానం, దుప్పట్ల పంపిణీ, పారిశుద్ధ్య సిబ్బందికి రక్షణ దుస్తులు అందించి గుర్తింపు పొందారు. పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు, అనాధాశ్రమాలకు బియ్యం, వాషింగ్ మిషన్, ఆర్థిక సహాయం అందించారు. వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో అనేకమంది బాధితులకు సహాయం అందించారు. 2022 ఆగస్టు 8న పక్షవాతంతో బాధపడుతున్న సముద్రాల ప్రసాద్‌కి రూ.50 వేల సహాయం, 2023 ఫిబ్రవరిలో అనారోగ్యంతో ఉన్న అమ్మవారిశాల అర్చకుడు సునీల్ శర్మకు రూ.80 వేల ఆర్థిక సహాయం, తిరువీధి మురళీ మృతి చెందగా ఆయన కుటుంబానికి రూ.70 వేల విరాళం అందజేశారు. రీజనల్ చైర్‌పర్సన్ కల్కి సతీష్ గాడుబావి వీరాంజనేయస్వామికి రూ.10 వేల డమరుకం బహూకరించారు. ఏటా పాఠశాల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, నోట్‌బుక్స్, ప్రోత్సాహక బహుమతులు అందించడంతో పాటు ఉచిత వైద్య శిబిరాలు, మహిళలకు ముగ్గుల పోటీలు, నవరాత్రి సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలకు బహుమతులు అందజేస్తూ సమాజ అభివృద్ధిలో భాగస్వాములవుతున్నారు.

భగవంతుడి సేవగా భావిస్తున్నాం



ప్రాచీన కాలం నుంచి నేటి వరకు మన భారత దేశంలో యోగుల నుంచి రాజుల వరకు సమాజ సేవలో తరించారు. సమాజ ఉద్ధరణకు ప్రాధాన్యత ఇచ్చారు. సమాజ సేవయే భగవంతుడి సేవగా భావిస్తూ ఆయా సందర్భాల్లో పేదలు, అనాథలకు మా వంతు తోడ్పాటు అందిస్తున్నాం.

–సుధీర్, వాసవీ క్లబ్ అధ్యక్షుడు

ఆటలకు ఆటంకం



మైదానంలో పెరిగిపోయిన పిచ్చిమొక్కలు

అవుకు(కొలిమిగుండ్ల): అవుకు ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో విద్యార్థులకు అసౌకర్యంగా మారింది. పాఠశాల ముందు భాగంలోని మైదానంలో సగభాగంలో పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. ఒకే చోట బాలురు, బాలికల పాఠశాలలు ఉన్నాయి. ఎక్కువ భాగం ఈ క్రీడామైదానాన్ని బాలుర పాఠశాల విద్యార్థులు ఉపయోగిస్తుంటారు. అస్తవ్యస్థంగా మారడంతో ఆటలు ఆడేందుకు అవకాశం లేకుండా పోతుంది. టాయిలెట్లకు పోయే దారిలో పిచ్చి మొక్కలు అల్లుకుపోయాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో స్థానిక యువత ఆటలతో పాటు వాకింగ్ చేస్తుంటారు. వాళ్లకు సైతం ఇబ్బందికరంగా మారుతోంది. విద్యార్థులు పిచ్చిమొక్కల్లో సంచరించే సమయంలో ఎక్కడ విషసర్పాలు ఉంటాయోనని భయభ్రాంతులకు గురవుతున్నారు. పాఠశాల సిబ్బంది చర్యలు తీసుకుని పిచ్చిమొక్కలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లితండ్రులు కోరుతున్నారు.

ఆగని రైలు.. తప్పని అవస్థలు



బనగానపల్లె రైల్వేస్టేషన్

బనగానపల్లె: నియోజకవర్గ కేంద్రంగా ఉన్న బనగానపల్లె రైల్వే స్టేషన్‌లో చర్లపల్లి-తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైలుకు స్టాపింగ్ కల్పించాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రతి బుధవారం రాత్రి 9.30 గంటలకు చర్లపల్లి నుంచి బయల్దేరే ఈ ఎక్స్‌ప్రెస్ రైలు గురువారం మధ్యాహ్నం 2.30 గంటలకు తిరుపతికి చేరుతుంది. తిరుగు ప్రయాణంలో గురువారం సాయంత్రం 4.30 గంటలకు తిరుపతి నుంచి బయల్దేరి శుక్రవారం ఉదయం 8 గంటలకు చర్లపల్లికి చేరుతుంది. ప్రస్తుతం బనగానపల్లె మీదుగా నంద్యాల-రేణిగుంట డెమో రైలు, విజయవాడ-తిరుపతి ఎక్స్‌ప్రెస్ మాత్రమే నడుస్తున్నాయి. అయితే బనగానపల్లె నుంచి తిరుపతికి వెళ్లే ప్రయాణికులు అధికంగా ఉండడంతో ఈ రెండు రైళ్లు సరిపోవడం లేదని వాపోతున్నారు. అందువల్ల చర్లపల్లి-తిరుపతి ఎక్స్‌ప్రెస్‌కు బనగానపల్లెలో స్టాప్ ఇవ్వాలని ప్రజలు రైల్వే అధికారులను కోరుతున్నారు.

ప్రమాదం అంచున ఓవర్‌హెడ్ ట్యాంక్



పూర్తిగా దెబ్బతిన్న ఓవర్‌హెడ్ ట్యాంక్



పెచ్చులూడి కడ్డీలు తేలిన ట్యాంకు పిల్లర్లు

మండలంలోని కలుగొట్లలోని ఎం. గోవిందిన్నెకు వెళ్లే రహదారి పక్కన ఏర్పాటు చేసిన ఓవర్‌హెడ్ ట్యాంకు శిథిలావస్థకు చేరుకుంది. సుమారు 20 ఏళ్ల క్రితం నిర్మించిన ట్యాంకు కావడంతో పూర్తిగా దెబ్బతింది. ట్యాంకు అడుగుభాగం, ట్యాంకు పిల్లర్లు పెచ్చులూడి కడ్డీలు తేలాయి. ట్యాంకులో నీటిని నిల్వ ఉంచితే కూలిపోతుందనే భయంతో ట్యాంకు నిండిన వెంటనే కొళాయిల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని శిథిలావస్థకు చేరిన ట్యాంకును తొలగించి ఆ స్థానంలో కొత్త ట్యాంకు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

– కోవెలకుంట్ల

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
డోన్, బనగానపల్లె
90100 55532 (డోన్)
70750 09103 (బనగానపల్లె)
Office mail : sakshiknladvt@gmail.com